# కుంకుమ రేఖ

"శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం...." తలంటు స్నానం చేసి పూజ ముగించుకొచ్చిన శ్రీవల్లి రఘురాం చెవిలో గట్టిగా వల్లిస్తోంది. ఆరని ఆవిడ కురులు నిద్రలేవని రఘురాం చెంపలమీద దాగుడు మూతలాడు తున్నాయి. కిటికీలోంచి దూసుకొచ్చిన బాలభాస్కరుని లేత కిరణాలు ఇద్దరి మొహాల్ని కలిపి ఇంద్రధనస్సుగా మార్చేశాయి. శ్లోకం మూడుసార్లు విని కళ్లు తెరచిన రఘురాం గుండెల్లో శ్రీవల్లి ముఖారవిందం పూలజల్లు కురిపించింది.

పొడగాటి ముక్కూ, చలాకీ కళ్లూ, కళ్లను కాపలా కాస్తున్న కనుబొమలూ, కనుబొమల మధ్య పావలా కాసంత కుంకుమ బొట్టు ఉదాత్త భావాలకు ప్రాణం పోస్తోంది.

"లే మహానుభావా....లే!" గిలిగింతలు పెట్టింది. ఒళ్ళు విరిచేందుకు ధనస్సులా వంగి మంచమ్మీంచి దిగాడు రఘురాం. శ్రీవల్లి పాదాలకు స్పృశించి కళ్లకద్దుకున్నాడు.

చిన్నప్పట్నుంచి తల్లిలా పెంచిన వదినకు రోజూ నిద్ర లేవగానే పాదాభివందనం చెయ్యడం అలవాటైంది రఘురాంకు. రఘురాంకూ అతని అన్నకూ మధ్య వయస్సులో పన్నెండు సంవత్సరాల తేడా. రఘురాంకు ఎనిమిదేళ్లు దాటగానే తల్లీదండ్రులీ లోకంలోంచి వెళ్లిపోయారు. ఆ తర్వాతే శ్రీవల్లి ఆ ఇంటి కోడలుగా వచ్చింది. రఘురామే తన కొడుకనుకుంది.

"దీర్ఘాయుష్మాన్ భవా, త్వరగాలే... నీకో వార్త చెబుతా!"

"వార్తనా....త్వరగా చెప్పొదినా!" పెద్ద పత్రిక్కి విలేఖరిగా పని చేస్తున్న రఘురాంకు నిద్ర మత్తు వదిలింది.

"మనింటిపక్క నర్సింగ్ హోం.... అదే నీ ఫ్రెండ్ డాక్టర్ నర్సింగ్ హోం...."

"ఏమైందొదినా?"

ఆపరేషన్ ఫెయిలై ఎవరో చచ్చుంటారనుకుని కంగారు తొంగి చూచిందతన్లో.

"దానికేం గాలేదు కానీ అందులో వార్త రాయదగిన సంఘటన జరిగింది"

"వార్త రాయదగ్గ సంఘటనా?"

"ఔను. నిన్న రాత్రి పదిన్నరకో యువతి పండంటి కొడుకును కని తెల్లారేసరికల్లా పుట్టుగుడ్డునొదిలేసి పారిపోయిందట! అన్నట్టు ఆ పుట్టుగుడ్డకు తలంటునూనె మనింట్లోంచే తీసికెళ్లింది రాత్రి ఆయా!"

"మనిట్లోంచే ఎందుకటా. దుకాణాల్లో దొరకదా?"

"నువ్వేం విలేఖరివయ్యా బాబు? అంతరాత్రి దుకాణాలు తీసుంటాయా" కిసుక్కుమంది.

నాలిక్కరుచుకుని బాత్రూంపై పెళ్లాడు.

* * *

అనాధ శిశువును తండోపతండాలుగా చూసి వెళ్తున్నారు జనాలు. డాక్టర్లింకా రాలేదు. వచ్చింతర్వాత ఆ పసికూనను పెంపకానికి తీసికెళ్లాలని కాచుక్కూచున్నారు కొందరు.

"వళ్లు బలిసి పెళ్ళీ పెటాకులు కాకుండా కని పారేసిందేమో!" బుగ్గలు నొక్కుకుందో యువతి.

"అలాగైతే రెండు మూణ్ణెల్లప్పుడే కడుపు తీయించుకుంటే పోయేది" ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులా పోజిచ్చిందో నడివయసావిడ.

"ఇదేం మాయదారి కాలమమ్మా! ఆ రోజుల్లో ఇలాంటివి చూశామా?" ఓ ముసలావిడ నాల్గు వేళ్ళను మూతికీ ముక్కుకూ అడ్డంగా పెట్టుకుంది— ఆశ్చర్యం ప్రకటించడంలో తనకెవరూ సాటిరారన్నట్టు.

ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వారు విసుర్తూ వెళుతున్నారు.

మంది పలచబడింతర్వాత లోపలికెళ్లి పసి గుడ్డును చూడగలిగాడు రఘురాం. బాబు బుల్లి బుల్లి చేతులాడిస్తున్నాడు. బొద్దుగా, ముద్దుగా ఉన్నందున ముద్దుపెట్టుకోవాలనిపించింది. ఫోటో తీశాడు. ఎమ్మే పాసైన రఘురాంకు ఉద్యోగం దొరకలేదు. నిజానికతడు సిన్సియర్‌గా ప్రయత్నించ లేదు ఉద్యోగం కోసం.

"నాల్గు చేతులా సంపాదించే అన్నయ్యా, అన్నపూర్ణలాంటి వదిన ఉండగా నాకేం లోటు?" అనుకుంటాడు. పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడల్లా బెంబేలెత్తి పోతాడు. చేసుకోనని మొండికేస్తాడు. అప్పుడతని చెంపలు వాయించాలన్నంత కోపమొస్తుంది శ్రీవల్లికి.

అందమైన ఆడదికానీ, ప్రకృతి దృష్యంగానీ కనబడితే అతనిలో ఏదో కలవరం చెలరేగుతుంది. హృదయం వణికి పోతుంది. కాస్సేపు మరో లోకంలో విహరిస్తాడు.

పక్క గదిలో కెళ్లి సూదులు వేడిచేస్తున్న నర్స్‌నడిగాడు.

"అసలెలా వెళ్ళిపోయిందండీ ఆ తల్లి?"

"ఆవిడో చక్కని చుక్కండీ" రఘురాంను చూపుల్తోనే తినేస్తుందానర్స్ "చాలా బీదదట. డాక్టర్లు ఫీజు కూడా అడగలేదు. ఆమె వెంట ఎవరూ లేరు. కాన్పు కష్టమైంది. రాత్రి పది తర్వాత పెద్దాపరేషన్ చేసి కాన్పు చేశారు. మా కళ్ళల్లో కారం గొట్టి మాయమైందా మహాతల్లి!"

నర్సు వాలకం నరాలను వణికించింది.

వార్తరాయాలని కూచోగానే అంతరంగంలో అల్లకల్లోలం బయలు దేరింది. దృక్కులు కిటికీలోంచి దూరి ఆకాశంలోని మబ్బుల్తో ఆడుకుంటు న్నాయి. గతం దృష్యాలు ఎద తెరమీద ప్రత్యక్షమౌతున్నాయి.

"జకియా.... దేవదూత జకియా...."

మేలిమి బంగారు ఛాయ. పుష్టి కలిగిన చెక్కిళ్లు. మొదటి చూపులోనే మంత్రముగ్ధుణ్ణి చేసింది.

వరంగల్‌లో ఎమ్మే చదివేప్పుడు ఎదురింట్లో ఉండేది. రోజూ ఉదయం పాల పాకెట్లు ఇంటింటికి చేరవేసి పాకెట్టుకు రెండూ్రపాయల చొప్పున నెల నెలా వసూలు చేసుకునేది. పాల పాకెట్ తన రూంలో ఉంచి "సుప్రభాతం సార్" అంటూ వెళ్లేది. ఆవిడను పలుకరించాలనే ప్రయత్నం వారం రోజుల తర్వాత ఫలించింది. ఆరోజు కళ్లలోకి సూటిగా చూడనిచ్చింది. కమ్మగా నవ్వింది. కొద్దిరోజుల్లో ఆవిడ బెరుకుతనం, భయం పూర్తిగామాయమైనాయి.

తను కాలేజికి వెళ్లేప్పుడూ, వచ్చేప్పుడూ ఇంటి ముందు నిల్చునేది. చిరునవ్వుతో కళ్లతో, పెదాల కదలికతో బదులు పలికేది. వాళ్ళమ్మ ఇంట్లో ఉంటే బయటకొచ్చేదిగాదు. మొదట్లో వాళ్లమ్మ డ్యూటీ టైం, తన కాలేజీ టైం ఒకే రకంగా ఉండేవి. తర్వాత కాలేజీ టైం మారింది.

జకియా వాళ్లది గుంటూరట. తండ్రి చనిపోయాక తల్లీ కూతుళ్ళు పొట్ట చేత పట్టుకొని వరంగలొచ్చారట. వాళ్ళమ్మకు అజంజాహీ మిల్లులో రెగ్యులర్ కూలీగా ఉద్యోగం దొరికిందట.

వాళ్ళమ్మ డ్యూటీకెళ్ళగానే ఆమె తన గదిలో ప్రత్యక్షమయ్యేది. కళ్లల్లో కళ్లు కలిపి బోలెడన్ని కబుర్లు చెప్పేది. ఆమె నవ్వులో గంగానది గలగలలూ గోదావరి కిలకిలలూ వినబడేవి. ఆమెతో మాట్లాడుతున్నంతసేపూ అంతరిక్షంలో, బృందావన్ గార్డెన్స్‌లో చెట్టాపట్టాలేసుకుని పరుగులు తీస్తున్నట్టనిపించేది. అవిడ ఒడిలో తలానిస్తే తనకే స్వర్గమూ అక్కర లేదనిపించేది.

పరిచయం ప్రణయంగా మారింది. ప్రణయం ముదిరి పెళ్లిచేసుకోవాలని చేతిలో చెయ్యి వేయించి బాసలు చేయించింది. పరీక్షలు రాగానే ప్రణయ కలాపానికి తాత్కాలింగా తెరవేయ్యాల్సొచ్చింది ఏకాగ్రత కొరకు. పరీక్షలైంతర్వాత తెలిసింది జకియా తల్లి పట్టుబట్టి అవిడ పెళ్లి అర్జెంటుగా చేసి పంపించిందని. పరీక్షలప్పుడు హోటల్లో భోంచేయడంతో పాలపాకెట్ల అవసరం గూడా రాలేదు. ద్వారాలు తెరుచుకున్న స్వర్గలోకానికి వెళ్తుంటే రాక్షస మాయ ఆపినట్టనిపించింది. గుండె అరల్లో విషాదం వికటాట్టహాసం చేసింది.

"టిఫిన్ తీసుకో రఘురాం, చల్లారి పోతుంది" వదిన వీపు తట్టింది.

* * *

వారం రోజుల తర్వాత వార్త ఫోటోతో సహా వచ్చింది పత్రికలో.

"మన వార్తాపత్రికలు ఆలస్యంలో రైళ్ళను మించిపోతున్నా" యన్నాడు డాక్టర్ అందరినీ నవ్వించాలని. ఎవ్వరూ నవ్వలేదు.

"అది మురిగిపోయే వార్త కాదు కాబట్టి ఎప్పుడొచ్చినా ఒకటే" అన్నాడు రఘురాం—డాక్టర్ వాలకానికి వచ్చే నవ్వును ఆపుకుంటూ.

నర్సింగ్ హోంలో చర్చ జరుగుతోంది.

అప్పుడే డిస్చార్జయి వార్డులోంచి వస్తున్న పేషెంట్ మీద పడింది రఘురాం దృష్టి. నిర్ఘాంతపోయాడు. అంతరంగంలోని అల్లరి మొహమ్మిది

రంగులు మార్చేసింది. పేషెంట్ మొహంలో ఆశ్చర్యం, ఆనందం ద్యోతక మయ్యాయి. ఇద్దర్నీ చదివిన డాక్టర్

"ఈమె మీకు తెలుసా?" అడిగాడు రఘురాంను.

"ఔను....ఈమె....ఆమెనే" అనుకున్నాడు రఘురాం.

గుండెల్లో గుసగుసలు బయరుదేరినై.

"మీకు వీరు తెలుసా?" పేషెంటు నడిగాడు డాక్టర్.

"రఘురాంగారు నాకు బాగా తెలుసు" ముడుచుకుపోయిందావిడ.

* * *

"బాగున్నావా జకియా!" తన గది నలుముకున్న నిశ్శబ్ధాన్ని చీల్చే శాడు రఘురాం. వంచిన తల ఎత్తలేదామె.

"నీ భర్త ఎక్కడున్నాడు, ఏంచేస్తున్నాడు?"

జకియా కలువ కళ్ళు ఊట చెలిమలయ్యాయి. నున్నటి కపోలాలను చుంబించిన అశ్రుబిందువులు ముత్యాల్లా రాలి నేలమీద మెరుస్తున్నాయి. అవ్యక్తమైక భావం రఘురాం నావేశించి కళ్ళు తడిచేసింది.

" నిన్ను నా హృదయ ఫలకమ్మీంచి తుడిచెయ్యలేక పోతున్నాను. జీవన యానంలో ఒంటరి నయ్యాను జకియా!"

"ఆరాటం అందలమెక్కుతానంటే అధైర్యం అధఃపాతాళానికి విసిరే సింది. అమ్మనెదిరించలేక పోయాను. అధోగతయ్యాను రఘురాం!" వెక్కి వెక్కి ఏడుస్తున్న జకియా గుండెలు ఎగిసి పడ్తున్నాయి. పెదాల ప్రకంపనం పెరిగి పోతుంది:

"ఎలా....ఎలా జకియా?"

"మా పెళ్ళయింతర్వాత ఒక సంవత్సరం బాగానే గడిచింది. నీ జ్ఞాప కాలు నన్ను వెన్నంటి తరుముతూంటే అతని భార్యగా మిగిలాను కాని జీవిత భాగస్వామిని కాలేకపోయాను. కొన్ని రోజుల తర్వాత నేను తల్లిని కాబోతు న్నానని తెలిసింది. పెళ్లప్పుడురాని కట్నం ప్రసక్తి అప్పుడు వచ్చింది, కట్నం డబ్బులు ఇరవైయ్యేదు వేల రూపాయలు తెమ్మని నన్ను కాల్చుకు తినడం ప్రారంభమైంది. అప్పటికే మా అమ్మ చనిపోయింది. రోజూ తాగొచ్చి నా భర్త నన్ను గొడ్డును బాదినట్టు చితక బాదినా సరిపెట్టు కున్నాను. అతడు మరో పెళ్లి చేసుకోబోతున్నాడని తెలిసినా కిమ్మనలేదు.

ఒక రోజు.... నిండు చూలాలినని తెలిసికూడా మెడపట్టి బయటకు గెంటేసి "నీ దిక్కున్న చోట చెప్పుకో ఫో!" అన్నాడు. లోకమంతా శూన్యంగా కన్పించింది. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను కాని అంతరాత్మ ఎదురు తిరిగింది. ఎటువెళ్లాలో దిక్కు తోచలేదు. మీ ఊరి బస్సెక్కాను. బస్సులోనే నొప్పులొచ్చి సై. ప్రయాణీకులు కొందరు నన్నీ నర్సింగ్ హోంలో చేర్చారు. ప్రసవానికి ముందే డాక్టర్లకు చెప్పాను. నా పరిస్థితినంతా చెప్పేసాను. దయామయులు డాక్టర్లు నేను పారిపోయానని చిన్న అబద్ధం ప్రచారం చేసి పసిగుడ్డుకు ప్రజల సానుభూతి సంపాదించి పెట్టారు. ఎవరికో పెంపకానికి చ్చార్టకూడా. నన్నా దేవుడు కూడా క్షమించడు కదూ!" కట్టలు తెంచుకున్న చెరువునీళ్లలా మారాయావిడ కన్నీళ్లు.

బయట పడబోతున్న అశ్రుబిందువుల్ని కనుకొలుకుల్లో బలవంతంగా నొక్కిపెట్టాలని ప్రయత్నించాడు రఘురాం. కాని అవి టపీమని చెంపల మీద రాలాయి.

ఎవరినోటా మాట రావడంలేదు. ఒకర్నొకరు చూచుకుంటున్నారు నిండు హృదయాల్తో.

గడపలో ఎప్పుడొచ్చి నిల్చుందో శ్రీవల్లి "మా రఘురాముడి మనసు దొంగిలించిన జానకి ఈవిడే నన్నమాట!" అంటూ కుంకుమ భరిణ రఘురాం చేతికిచ్చింది. కళ్లతో సైగ చేసింది ఇంకా ఆలస్యమెందుకని.

రఘు రాం గుండెల్లో చైతన్య విహంగం రెక్కలు విప్పింది. నరనరాల్లో ఉత్సాహం పరుగులు తీసింది, జకియా పెదవుల మీద అద్భుతమైన మందహాసం మెరిసింది,

ఇది కలనా, నిజమా... నమ్మలేకపోయింది, ఆశ్చర్యం నుండి తేరుకునే లోగా రఘు రాం ఆమె నుదుట కుంకుమ రేఖ దిద్దాడు,

ఊబిలో కూరుకుపోతున్న అర్భకుడిని బయటకులాగి ఉచ్ఛాసనమ్మీద కూర్చొబెట్టినట్టు గంతులేసిందావిడ మనస్సు, ముఖ పద్మం వేయి రేకులుగా విప్పుకుంది, శరీరంలోని ప్రతి అణువూ కృతజ్ఞతా భావంతో పులకించి పోయింది,

చిన్నపిల్లలా చప్పట్లు వేసి

"ఆనంద మానందమాయెనే, మా రఘు రాము డింటివాడాయెనే" అంటూ జకియాను లోపలికి తీసికెళ్లింది శ్రీవల్లి.

ఆ తర్వాత విషయమంతా తెలిసిన రఘు రాం అన్నగారి ఛాతీ గర్వంతో కొన్నంగుళాలు వెడల్పైంది, *

(జాగృతి 8-2-1993)